సాక్షి చిత్తూరు

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



'సూపర్' నయా మోసం

సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి నేతలు మరో మోసానికి తెర తీశారు. అతివలతో పోస్టల్ అకౌంట్లు తెరిపిస్తున్నారు. - 8లో



సైబర్ సవాళ్లను అధిగమించాలి

సైబర్ నేరగాళ్లు విసురుతున్న సరికొత్త సవాళ్లను పోలీసులు అధిగమించాలని జిల్లా ఎస్పీ మణికంఠ సూచించారు. - 8లో



ముత్యపు 'సింహా'సనాన..

తిరుచానూరు పద్మావతీ అమ్మవారు శనివారం ముత్యపు పందిరి, సింహవాహనాలపై ఊరేగారు. - 8లో

న్యూస్‌రీల్

గువ్వకల్లులో అక్రమ గ్రానైట్ తవ్వకాలు?



గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం గువ్వకల్లు రెవెన్యూలో గ్రానైట్ తవ్వక పనులు జోరందుకుంటున్నాయి. రోడ్డు నుంచి కొండ వరకు విశాలమైన రోడ్డు వేసుకుని దర్జాగా క్వారీపై సవారీ చేస్తున్నారు. ఈ పనులు నెల రోజులుగా సాగుతున్న రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కొందరు వ్యక్తులు ప్రశ్నిస్తే అనుమతులున్నాయని చెబుతూ కొండను తవ్వేస్తున్నారు. దీనిపై మైనింగ్ శాఖలో విచారిస్తే మండలంలో ఎలాంటి అనుమతులు లేవని ఆ శాఖలోని ఆర్‌ఐ, సిబ్బంది తేల్చారు.

ట్రాన్స్‌కో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: తుపాను నేపథ్యంలో జిల్లాలోని మూడు డివిజన్లలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. విద్యుత్ సమస్యలను ఆ నంబర్లకు తెలపాలని కోరారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో 94408 17419, చిత్తూరు రూరల్ డివిజన్ కు 94910 52934, పుంగనూరు డివిజన్ 91549 53764 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో చిత్తూరు నియోజకవర్గం, బంగారుపాళెం, యాదమరి, పైపల్లె, అరగొండ, ఐరాల ప్రాంతాలు వస్తాయన్నారు. చిత్తూరు రూరల్స్ డివిజన్‌లో ఆవులకొండ, జీడీనెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు, పూతలపట్టు, కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం, నగరి, నింద్ర ప్రాంతాలు ఉంటాయన్నారు. పుంగనూరు డివిజన్‌లో సదుం, కలికిరి, రొంపిచెర్ల, సోమల, పుంగనూరు, చౌడేపల్లె, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోట ప్రాంతాలు వస్తాయని చెప్పారు.

నేడు ఎయిడ్స్ నివారణ దిన ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం జెడ్పీ సమావేశమందిరంలో సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

20 మందికి ఉద్యోగోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో పనిచేస్తున్న 20 మంది అటెండర్లకు రికార్డు సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ సీఈఓ రవి కుమార్‌నాయుడు ఉత్తర్వులు శనివారం జారీ చేశారు. వరదరాజులు, శంకర్, రాజేశ్వరి, బాబు ఫకురుద్దీన్, ఆనందమ్మ, అమర్‌నారాయణ, ప్రేమ్‌కుమార్, రేష్మ, వేణుగోపాల్, సుబ్రమణ్యం, విజయలక్ష్మి, సుజాత, సీత, రెడ్డమ్మ, మొగిలీశ్వర్‌రావ్, అనిత, చిత్ర, శాంతమ్మ, సురేష్‌బాబు తదితరులు ఉద్యోగోన్నతి పొందారు.

ఫెంగల్ తుపాను ప్రభావం.. రోజంతా విడవని వర్షం.. చెట్లు.. విద్యుత్ స్తంభాలు ధ్వంసం.. పంటలకు నష్టం.. నగరి నియోజకవర్గంలో వర్షపాత నమోదు అత్యధికం.. స్తంభించిన జన జీవనం.. అధికార యంత్రాంగం అప్రమత్తం.. ఎక్కడికక్కడ ప్రభుత్వ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు సిద్ధం.. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశం. అయినా జడిపిస్తున్న వాన. మొత్తంగా ఫెంగల్‌తో జనానికి కష్టాలు తప్పడం లేదు.





పాలసముద్రం: మండలం తొట్టికండ్రిగ, గంగమ్మపురంలో దెబ్బతిన్న అరటి పంట

ఫెంగల్.. నష్టాల్

ఫెంగల్ తుపాను అలెర్ట్

- ఈదురు గాలులతో ప్రజలకు ఇబ్బందులు
- నగరి నియోజకవర్గంలో అత్యధికంగా 89.2 మి.మీ వర్షపాతం
- నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో పంటనష్టం
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్న జిల్లా యంత్రాంగం
- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ **94910 77356**

చిత్తూరు కలెక్టరేట్ : ఫెంగల్ తుపాను కారణంగా జిల్లాలోని 32 మండలాల్లో వర్షపాతం నమోదైంది. కాగా ఫెంగల్ తుపానుతో వీచిన ఈదురు గాలులకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే జిల్లాలోని ప్రజలకు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తోపాటు ఆర్డీఓ, కార్పొరేషన్, మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లలో విధులకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, 24 గంటల పాటు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఫెంగల్ తుపానుకు జిల్లాలోని ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేసి, సహాయక చర్యలు పకడ్బందీగా చేపట్టేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓలు, ఇతర అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రతి మండలంలో చెరువులు, కట్టలు, కాలువల పరిరక్షణపై దృష్టి పెట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.

రైతులను అప్రమత్తం చేయండి

వ్యవసాయ, ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలన్నారు. పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించి రైతులకు ఈ విషయమై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో పెట్టుకోవాలని చెప్పారు. పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఉన్నట్లైతే గుర్తించి, అందులో ఉన్న వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అత్యవసరమైన మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా గుర్తించాలన్నారు. మండలాల్లో కల్వర్టులు, బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లు

ఫెంగల్ తుపాను కారణంగా క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు తలెత్తితే తెలియజేసేందుకు కలెక్టరేట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రభుత్వ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో 94910 77356 , 08572–242777, అలాగే నగరపాలక, మున్సిపాలిటీ, ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి అధికారులు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.



నగరి నియోజకవర్గంలో నేలకొరిగిన చెట్టు

జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలివీ (మి.మీ.ల్లో)				
	నగరి 108.6	నింద్ర 94.2	కార్వేటినగరం 77.4	విజయపురం 70.4
	పాలసముద్రం 56.0	రొంపిచెర్ల 43.2	ఎస్‌ఆర్ పురం 46.0	పులిచెర్ల 41.2

నగరిలో అత్యధిక వర్షపాతం

జిల్లాలో ఫెంగల్ తుపాను కారణంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలోని 32 మండలాల్లో శనివారం కురిసిన వర్షపాతం మొత్తం 1133.8 మిల్లీమీటర్లుగా నమోదు కాగా, సగటు వర్షపాతం 35.4 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో అత్యధికంగా నగరి మండలంలో 108.6, అత్యల్పంగా గుడుపల్లిలో 6.4 మిల్లీ మీటర్ల వర్షపాతంనమోదైంది. నింద్రలో 94.2, కార్వేటినగరం 77.4, విజయపురం 70.4, పాలసముద్రం 56.0, ఎస్‌ఆర్ పురం 46.0, రొంపిచర్ల 43.2, పెనుమూరు 42.2, సోమల 41.6, పులిచెర్ల 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకు ఒరగడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తలెత్తింది. నగరి పట్టణంలో ఫ్లెక్సీలు విరిగి రోడ్డుపై పడ్డాయి. అలాగే గంగాధరనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజపురం గ్రామంలో వర్షానికి వరి పంట నేలకొరిగింది. కాగా నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో అధిక వర్షాలకు నెలకొరిగిన చెట్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

అధికారులను అప్రమత్తం చేశాం



ఫెంగల్ తుపాను కారణంగా అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అధిక వర్షాలు కురిస్తే చేపట్టాల్సిన సహాయక చర్యలను ముందస్తుగా పకడ్బందీగా చేపట్టాం. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సహాయక చర్యలను చేపట్టేందుకు అధికారులను అప్రమత్తం చేశాం. చెరువులు, వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను వాగులు, వంకల వద్దకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలి. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వేగవంతంగా సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు జిల్లా



నగరిలో ఈదురు గాలులకు పడిపోయిన బ్యానర్లు



పాలసముద్రం : మొరవపోతున్న ఎస్‌కేఆర్ పురం చెరువు





శ్రీకావేరిరాజాపురం గ్రామంలో నేలకొరిగిన వరిపంట, బంగారుపాళెంలో చిరువ్యాపారుల వాన కష్టాలు

పేదల బియ్యం.. పెద్దల పరం

పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. రూపు మార్చుకుని(పాలిష్) బహిరంగ మార్కెట్‌లోకి వెళుతోంది. రేషన్ అక్రమాలకు అంతేలేకుండాపోయింది. తవ్వేన కొద్దీ కొత్త కొత్త అక్రమాలు బహిర్గతమవుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారం ప్రస్తుతం కూటమి నేతలకు వరమై, కాసుల వర్షం కురిపిస్తోంది. స్మగ్లర్లతో అధికార పార్టీ నేతలు సిండికేట్ అయ్యి.. మూడు కిలోలు.. ఆరు బస్తాలుగా అక్రమ వ్యాపారం సాగుతోంది.

మాకొదిలేయండి... మేం చూసుకుంటాం!

- బియ్యం స్మగ్లింగ్‌ను గుప్పిట్లోకి తీసుకున్న కూటమి నేతలు
- స్మగ్లర్లతో కూటమి నేతలు సిండికేట్
- ఎవరికీ మామూళ్లు వద్దు
- మేమున్నామంటూ హామీ

పలమనేరు: పేదలకు చేరిన చౌక బియ్యం అక్రమ మార్గాల్లో జిల్లా నుంచి కర్ణాటకకు తరలుతోంది. ఇప్పటిదాకా చౌక బియ్యం వ్యాపారాన్ని కొందరు స్మగ్లర్లు మాత్రమే చేస్తూ అడ్డుపడిన సంబంధిత శాఖలకు మామూళ్లు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమాల రూటే మారిపోయింది. అధికారపార్టీకి చెందిన కొందరు నేతలు చెప్పు చేతల్లోకి బియ్యం వ్యాపారం వెళ్లిపోయింది. స్థానికంగా కొందరు సేకరించిన చౌక బియ్యాన్ని ఇక్కడి కూటమి నేతల పేరిట కొందరు వ్యక్తులు నిర్ణయించిన ధరకే బియ్యాన్ని అమ్మాలి. ఎవరైనా వచ్చి ఎక్కువ ధరకు తాము బియ్యాన్ని కొంటామన్నా.. ఇక్కడి నేతలను కాదని అమ్మే ధైర్యం లేకుండా చేశారు. మొత్తం మీద ఈ ప్రాంతంలో జరిగే అన్ని అక్రమ వ్యాపారాలను అధికారాన్ని అడ్డుపెట్టుకుని వారి చేతుల్లోకి తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. జిల్లాలోని కార్డుదారులనుంచి, పొరుగునే ఉన్న తమిళనాడు నుంచి కొందరు ఏజెంట్లు చౌకబియ్యాన్ని సేకరించి కర్ణాటకకు తరలించి, అక్కడ అక్రమ బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు.



కర్ణాటకలోని బంగారుపేటకు చేరుతున్న చౌకబియ్యం(ఫైల్)



పాలిసిడ్ ప్రీమియం రైస్ బస్తాలుగా మారిన చౌకబియ్యం(ఫైల్)

చౌకబియ్యం సేకరణ ఇలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లాలోని 2,900 చౌకదుకాణాలున్నాయి. నెలకు దాదాపు 18 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లయిస్ శాఖ ఎంఎల్‌ఎస్ పాయింట్లకు ప్రైవేటు ఏజెన్సీలు ట్రాన్స్‌పోర్టు చేస్తాయి. సంబంధిత మండలాల నుంచి మళ్లీ కాంట్రాక్టర్ల ద్వారా బియ్యాన్ని ఎఫ్‌పీ షాపులకు చేర్చుతారు. అక్కడి నుంచి 11 లక్షల మంది కార్డుదారులకు బియ్యం పంపిణీ సాగుతోంది. ఆపై కార్డుదారుల నుంచి చౌకబియ్యాన్ని చిన్న ఏజెంట్లు సేకరిస్తున్నారు. వీరు ఎవరికీ ఏ మాత్రం అనుమానం రాకుండా బైక్‌లు, ఆటోల్లో ఎలక్ట్రానిక్ స్కేళ్లను వెంట బెట్టుకుని కార్డుదారుల నుంచి బియ్యాన్ని సేకరించి, వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా రకరకాలుగా సేకరించిన చౌకబియ్యం కొన్ని రహస్య స్టాకు పాయింట్లకు చేర్చి ఆపై కర్ణాటకలోని బంగారుపేటకు పంపుతున్నారు.

కూటమి నేతలు చెప్పినట్టు స్మగ్లర్లు వినాల్సిందే!

గతంలో కార్డుదారుల నుంచి చిన్న ఏజెంట్లు గ్రామాల్లో బైక్‌లు, ఆటోల్లో తిరుగుతూ కిలో రూ.15 నుంచి రూ.18 దాకా కొనేవారు. ఇలా సేకరించిన బియ్యాన్ని అక్కడి బియ్యం స్మగ్లర్లకు కిలో రూ. 20 నుంచి రూ.22 వరకు అమ్మేవారు. దీంతో చిన్న ఏజెంట్లకు కిలోకు రూ.4 వరకు మిగిలేది. వీరి నుంచి రూ. 23తో కొన్న వ్యాపారులు వాటిని కర్ణాటకలోని బంగారుపేట పాలిష్ మిల్లులు(స్పార్‌టెక్స్) రూ.32గా అమ్మేవారు. దీంతో వారికి కిలోకు రవాణా పోగా రూ.5 లాభంగా ఉండేది.

రూ.20కే అమ్మాలని నిర్ణయం

స్థానికంగా కర్ణాటకకు బియ్యం తరలించే వ్యాపారాలు చేసే నెట్‌వర్క్‌ను తెలుసుకున్న అధికారపార్టీకి చెందిన కొందరు స్మగ్లర్లతో మాట్లాడి సేకరించిన బియ్యానికి ధర నిర్ణయించారు. మీరెంతకైనా కొనండి మా స్మగ్లర్లకు కిలో రూ.20కే అమ్మాలని డిసైడ్ చేసినట్టు తెలిసింది. దీంతో అంతకంటే ఎక్కువకు కొనేందుకు ఎవరైనా వ్యాపారులు వచ్చినా అధికారపార్టీకి చెందిన వారు అడ్డు తగిలి వారు చెప్పినట్టు వినేలా డిసైడ్ చేశారు. దీంతో బియ్యం స్మగ్లర్లను సిండికేట్ చేసి, ఆ వ్యాపారాన్ని వారి గుప్పిట్లోకి తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరించడం కొసమెరుపు. ఈ విషయమై పలమనేరు తహసీల్దార్ ఇన్బునాథన్‌ను వివరణ కోరగా చౌక బియ్యాన్ని అమ్మినా, అక్రమ రవాణా నేరమని, దీనిపై తాము నిఘా పెట్టామని, బియ్యం స్మగ్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై ఎవరైనా సమాచారం ఇస్తే, వారి పేర్లు గోప్యంగా ఉంచి, స్మగ్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

- హెచ్‌ఐవీకి మందు లేదు.. నివారణ ఒక్కటే మార్గం
- సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు కలెక్టరేట్ : హెచ్‌ఐవీ రహితసమాజ స్థాపనే లక్ష్యమని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ కన్వర్షన్ సమావేశం నిర్వహించారు. డీఎంఅండ్ హెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఐవీకి ఖచ్చితమైన మందు లేదన్నారు. నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. 2030 నాటికి హెచ్‌ఐవీ రహితసమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్‌ఐవీ ఉన్న వ్యక్తుల సిరంజీలు తిరిగి వాడినా, పాజిటివ్ ఉన్న వ్యక్తుల రక్తం ఇతరులకు ఎక్కించినా హెచ్‌ఐవీ వ్యాపిస్తుందన్నారు. హెచ్‌ఐవీపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్‌కు కచ్చితమైన మందు లేదన్న విషయాన్ని ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులతో కలిసి భోజనం, కరచాలనం చేయడం, వారి పనిముట్లు తాకడంతో హెచ్‌ఐవీ వ్యాపించదని చెప్పారు. హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్న వ్యక్తులకు ఏఆర్‌టీ సెంటర్లలో ఉచితంగా మందులతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుని జీవితాంతం జీవించవచ్చన్నారు. పాజిటివ్ వ్యక్తులను ఎగతాళి చేసి మాట్లాడితే వైలేషన్ ఆఫ్ రూల్ సెక్షన్ 4 కింద రూ.లక్ష వరకు జరిమానా, జైలు శిక్ష విధిస్తారని చెప్పారు. జిల్లాలో హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్న 1600 మందికి ప్రతి నెలా రూ.4 వేల పింఛన్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. డీఐఓ హనుమంతరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల ఇన్సిడెంట్ రేట్ ప్రస్తుతం 0.07 ఉందన్నారు. సమష్టి కృషితో 2030 నాటికి ఎయిడ్స్‌ను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, డీపీఓ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతిదేవి

క్లుప్తంగా

సెకీ గురించి ఆధారాలతో సహా వివరించిన జగనన్న

– మాజీ మంత్రి ఆర్కేరోజా



నగరి : సెకీ గురించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా ఎక్స్ వేదికగా స్పందించారు. సెకీ గురించి ఆధారాలతో సహా తెలుగు, ఇంగ్లిష్‌లో జగనన్న వివరించారని తెలిపారు. పచ్చ పత్రికలో రాసిన కథనంలో పాయింట్లు పట్టుకుని కొందరు బురద జల్లుతున్నారని మండిపడ్డారు. 2021 మేలో సెకీ ఎక్కడ వేలం వేసింది?.. 2.14 పైసలకు ఎక్కడ అమ్మింది? అని చెప్పగలరా? అని ప్రశ్నించారు. అదానీ వద్ద కరెంటు కొనలేదని గుజరాత్ ప్రభుత్వ విద్యుత్ కంపెనీ డిస్కంల నుంచి కొనుగోలు చేశారన్నారు. అదానీతో ఒప్పందం చేసుకునేందుకు అప్పటి ప్రభుత్వం ఎప్పుడూ పరుగులు తీయలేదని స్పష్టం చేశారు. 2021, సెప్టెంబర్ 15న కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి ప్రభుత్వానికి లేఖ వచ్చిందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, గతంలో వచ్చిన టెండర్లలో అత్యల్ప ఆఫర్.. అంటే రూ.2.49 కే తమ మార్జిన్‌తో సహా విద్యుత్ సరఫరా చేస్తామని సెకీ ఆ లేఖలో వెల్లడించినట్టు తెలిపారు. ఇదే సెకీ, ఆత్మ నిర్భర్ ప్రాజెక్టు కింద తమిళనాడుకు, ఒడిశాకు, ఛత్తీస్‌గఢ్‌కు కూడా రూ.2.61కి విద్యుత్‌ను విక్రయించిందన్నారు. వారి కంటే 12 పైసలు తగ్గించి కొనుగోలు చేసినట్టు చెప్పారు. చంద్రబాబు హయాంలో సౌర విద్యుత్‌పై చేసుకున్న ఒప్పందాలు చూస్తే కళ్లు తిరుగుతాయన్నారు. పవన విద్యుత్ పీపీఏలు చూస్తే.. 2014–19 మధ్య రూ.4.84 నుంచి రూ.4.83 వరకు ఉందన్నారు. సోలార్ ఎనర్జీని సరాసరిగా రూ.5.90కి కొనుగోలు చేశారన్నారు. గత ప్రభుత్వం రూ.2.49కి కొనుగోలు చేస్తే అదేదో పెద్ద తప్పన్నట్లు బూతద్దంలో చూపుతున్నారన్నారు. రూ.5.90కి కొనుగోలు చేసినవారు మంచివారు, రూ.2.49కి కొనుగోలు చేసినవారు చెడ్డవారయ్యారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు.

38,729 మందికి అందని పింఛన్లు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టినా 38,729 మందికి నగదు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక పింఛను లబ్ధిదారులకు అన్యాయం చేస్తోంది. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్న వాటిని తొలగిస్తోంది. వైఎస్సార్ సీపీ సర్కారు పాలనలో వలంటీర్లు ఒకటో తేదీ వేకువజామునే లబ్ధిదారుల తలుపు తట్టి పింఛను మొత్తాలను ఇచ్చేవారు. అనారోగ్యంతో బాధపడుతూ దూర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న వారికి సైతం అక్కడికి వెళ్లి అందజేసేవారు. ప్రస్తుతం కూటమి సర్కారు తూతూమంత్రంగా పింఛన్ల పంపిణీని కొనసాగిస్తోంది. ముందస్తుగా పింఛన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునేందుకు ప్రాధాన్యతనిస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీలో 38,729 మంది నగదు పొందలేకపోయారు. చిత్తూరు జిల్లాలో 17,120 మంది, తిరుపతి జిల్లాలో 21,609 మందికి నగదు ఇవ్వలేదు. చిత్తూరు జిల్లాలో 2,66,703 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 2,49,583 మందికి, తిరుపతి జిల్లాలో 2,64,636 మందికి గాను 2,43,027 మందికి మాత్రం నగదు పంపిణీ చేశారు. మిగిలిన 38,729 మందికి పింఛన్ల పంపిణీ చేయడంలో కూటమి సర్కారు విఫలమైంది.

సూపర్ నయామోసం

అధికారం కోసం అబద్ధాలు.. అందలమెక్కినా మారని కూటమి ప్ర'బుద్ధులు'.. మహిళలకు రూ.1500 హామీ అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయని ప్రచారాలు.. ఆ నగదు కోసం తపాలా కార్యాలయాల్లో ఖాతాలు ఉండాలని ఊరూ వాడా ఢాంబికాలు.. వెరసి.. పోస్టాఫీసులకు మహిళల పరుగులు..అతివలకు తప్పని అగచాట్లు.. మొత్తంగా నయా 'సూపర్' మోసానికి తెరలేచింది.

- తపాలా చుట్టూ తిప్పలు
- బాబు రూ.1500 జమ చేస్తారనే ప్రచారం
- తపాలా కేంద్రాలకు భారీగా తరలివస్తున్న మహిళలు
- ఉదయం నుంచే వందలాది మహిళలు క్యూ
- సూపర్‌సిక్స్ పథకాల కోసమేనని ప్రచారం
- ఐపీబీపీ అకౌంట్ ఓపెన్ కోసం ఆరాటం



కార్వేటినగరం పోస్టాఫీసులో మహిళల రద్దీ

కార్వేటినగరం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని తపాలా కేంద్రాలకు వేలాదిగా తరలివస్తున్న మహిళల తాకిడితో కిక్కిరిసిపోతున్నాయి. 18 ఏళ్లు పైబడిన మహిళలందరి వ్యక్తిగత ఖాతాల్లో సీఎం చంద్రబాబు రూ.1500 జమ చేస్తారన్న విస్తృత ప్రచారంతో మహిళలు పోస్టాఫీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రతి రోజూ చలిని సైతం లెక్కచేయకుండా ఉదయం 5 గంటల నుంచి క్యూ కడుతున్నారు. నెల రోజులుగా పరిస్థితి ఉన్నా.. ఇటీవల రోజురోజుకు వీరి సంఖ్య మరింతగా పెరిగిపోతోంది. పోస్టాఫీసుల వద్ద తోపులాట జరిగే స్థాయి ఉందంటే మహిళల తాకిడి ఎలా ఉందో అర్థమవుతుంది.

సూపర్ సిక్స్ పథకాల కోసమంటూ..

కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తామంటూ వారు పదే పదే చెబుతున్నారు. గ్రామాల్లో ప్రజలు కూటమి ప్రభుత్వం హామీలో ఇచ్చిన పథకాలను ఇంకా అమలు చేయలేదని విమర్శలు గుప్పిస్తుండడంతో వారిని నమ్మించడంలో భాగంగా 18 ఏళ్ల నిండిన మహిళల ఖాతాల్లో రూ.1500 జమ చేస్తారని ప్రచారాన్ని కూటమి నేతలు జనంలోకి తీసుకెళ్లారు. దీంతో మహిళలు అది నిజమని నమ్మి పోస్టాఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. మహిళలు భారీ సంఖ్యలో వస్తున్న క్రమంలో అందుకు తగ్గట్టుగా చర్యలేవీ కనిపించడం లేదు.

బ్యాంకర్స్‌పై సీడింగ్ చేయడం లేదనే ఆరోపణలు

బ్యాంకర్లు ఖాతాకు ఆధార్‌లింక్ చేస్తున్నా.. సీడింగ్ చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా మహిళలు తపాలశాఖ ఇచ్చే ఐపీబీపీ ఖాతాలు తెరిచేందుకు భారీగా పోస్టాఫీసులకు తరలివెళుతున్నారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ కానివారు జిల్లాలో లక్షలాదిమంది ఉన్నట్లు సమాచారం. బ్యాంకుల్లో సీడింగ్ కాని మహిళలు ఐపీబీపీ ఖాతాల కోసం తపాలా కేంద్రాలకు తరలి వెళుతున్నారు.

రూ. 1500పై ఉన్నతాధికారులు స్పందించాలి

నగదు మార్పిడిపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. మహిళలు రూ.1500 చొప్పున ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారు. అందుకోసం మహిళలు ఏం చేయాలి, ఇప్పటికే బ్యాంకు ఖాతాలున్న మహిళలు ఎం చేయాలి, ఖాతాలేని వారు ఏ పోస్టాఫీసుకు, ఏ బ్యాంకును సంప్రదించాలనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో వైపు రూ. 1500 వట్టి ప్రచారమన్న భావనలు జనంలో వినిపిస్తోంది.

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతా కోసం..

నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతా కోసం మహిళలు తపాల కేంద్రాలకు వెళుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఐపీపీబీ (ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు) ఖాతాల్లో జమ అవుతాయి. ఇందులో ఖాతాలు తెరిచినంత మాత్రాన లాభం లేదు. ఆధార్ లింక్ అయి ఉండాలి. ఆధార్ సీడింగ్ అయి ఉండాలి.

పోస్టల్ అకౌంట్‌కు రూ.1500 వేస్తారట..



మహిళలకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.1500 జమ చేస్తుందని అంటున్నారు. అందుకు పోస్టాఫీసులో ఐపీబీపీ అకౌంట్ ఇండాలని అంటున్నారు. అందరితోపాటు వచ్చా, జనం ఎక్కువ ఉండడంతో గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. ఎప్పుడు అవుతుందో తెలియడం లేదు.

-పాతిమ, గాజుల కండ్రిగ, కార్వేటినగరం మండలం

ఉదయానే వచ్చాను



పోస్టాఫీసులో ఖాతా తెరిస్తే, ప్రభుత్వం డబ్బులు వేస్తుందని మా ఊర్లో అంటున్నారు. అంకౌంట్ కోసం ఉదయం నుంచి తిండి లేకుండా ఇక్కడే ఉన్నాను. జనం ఏ మాత్రం తగ్గడం లేదు. ఎప్పుడవుతుంతో తెలియడం లేదు. రూ.1500 సంగతి దేవుడెరుగు, కష్టాలు మాత్రం తప్పడం లేదు.

– సుమతి, పద్మసరస్సు, కార్వేటినగరం

సైబర్ సవాళ్లను అధిగమించాలి

చిత్తూరు అర్బన్: సాంకేతిక రంగం చేరువయ్యే కొద్దీ సైబర్ నేరగాళ్లు విసురుతున్న సరికొత్త సవాళ్లను అధిగమించడానికి పోలీసుశాఖ అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించడమే దీనికి విరుగుడన్నారు. శనివారం జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ నెలవారీ క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరిట విద్యావంతులు, ప్రముఖుల్ని బురిడీ కొట్టించి రూ.లక్షల్లో దోచుకుంటున్నారని తెలిపారు. అసలు డిజిటల్ అరెస్టులు అనేవి ఉండవనే విషయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా అలాంటి మోసాల బారినపడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, ఫోన్–1930కు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడే పోగొట్టుకున్న నగదును ఆయా బ్యాంకు ఖాతాల్లో నియంత్రించడం సాధ్యమవుతుందన్నారు. ఇక సబ్–డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంలో డీఎస్పీలు చొరవ చూపించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి, న్యాయస్థానాల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. నేరస్తులకు చట్టం ఎదుట శిక్ష పడాలంటే.. దర్యాప్తు అధికారులు నేరం జరిగినప్పుడు ప్రాథమికంగా సేకరించే సాక్ష్యాలే కీలకమనే విషయం గుర్తించుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, పట్టణాల్లో రోడ్లపై పోలీసులు తప్పనిసరిగా కనిపించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగేలా ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ



యోగా ఆసనాలు వేస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు కేంద్రంలో పోలీసులకు ఏడు రోజులుగా జరుగుతున్న యోగా శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. జిల్లాలోని ప్రతీ స్టేషన్ నుంచి ఒకర్ని ఎంపిక చేసి, చిత్తూరు శివానంద పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, ఒత్తిడి నివారణ, ఆరోగ్య–ఆర్థిక నిర్వహణ, వృత్తిపరమైన విలువలు ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఉద్యోగోన్నతుల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగోన్నతుల జాబితాలో అభ్యంతరాలు ఉన్నట్‌లైతే ఈ నెల 2వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు లిఖిత పూర్వకంగా తగు ఆధారాలతో తెలియజేయాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించి అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను డీవైఈఓ, ఎంఈఓలకు పంపామన్నారు. ఆ జాబితాను పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్‌లైతే సోమవారం సాయంత్రం లోపు తెలియజేయాలన్నారు. ఆ తర్వాత తెలియజేస్తే పరిగణలోకి తీసుకోబోమని డీఈఓ వెల్లడించారు.

ముత్యపు'సింహా'సనాన మురిపాల తల్లి



తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం ముత్యపు పందిరి వాహనసేవ 'మంగ'ళంగా సాగింది. అమ్మవారు ఆదిలక్ష్మి అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. రాత్రి సింహవాహన సేవలో సాక్షాత్కరించారు. యోగ నరసింహుడై అనుగ్రహించారు.

– చంద్రగిరి



ఎంపీపీ చిచ్చిలికి ఎంపీ మిథున్‌రెడ్డి పరామర్శ



ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి

రొంపిచెర్ల: ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డిని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి పరామర్శించారు. శనివారం చిచ్చిలివారిపల్లెలో ఎంపీపీ తల్లి చెంగమ్మ కర్మక్రియలకు హాజరై, ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎంపీపీ చిచ్చిలి కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చిన పెద్దిరెడ్డి కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమన్నారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, భార్య అరుణమ్మ, కుమారుడు ప్రశాంత్ రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, నాయకులు సలీంబాషా, డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, ఎల్. మహబుబ్‌బాషా, నాగిశెట్టి రెడ్డెన్న, నాగిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సదాశివరెడ్డి, కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, బషీర్, మస్తాన్, రాజా సాహెబ్, కె.రవీంద్రనాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, శ్రీనాథనాయుడు, ప్రసాద్‌నాయుడు, సురేంద్రనాయుడు, జాకీర్, గురు, కాలేషా, బావాజాన్, నిజాంవుద్దీన్, జి.రామచంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదుంలో కబడ్డీ జట్ల ఎంపిక రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సదుం పోలీసు గ్రౌండ్‌లో ఈ నెల 2వ తేదీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మమత తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే పురుషులు 85 కిలోల లోపు, మహిళలు 75 కిలోల లోపు బరువు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఏడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో గెలుపొందే క్రీడాకారులు డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే 71 వ అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 94403 45455, 94900 05167 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.